క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు దరఖాస్తులు



గుడివాడ టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. తక్షణమే సంబంధిత శాఖలకు ఫిర్యాదులు పంపి సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, మున్సిపల్ మేనేజర్ బి.నిర్మలకుమారి, ఏఓ జి.టి.నాయుడు, ఏసీపీ వి.ఏసుబాబు పాల్గొన్నారు.

తాగునీటి ఇక్కట్లు



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు రక్షిత మంచినీటి పథకం నుంచి గ్రామానికి సరఫరా అయ్యే పైపులైన్ల ఏర్పాటుకు ఆదివారం అంతరాయం ఏర్పడింది. దీంతో స్థానికులు తాగునీటి కోసం ఇబ్బందులుపడ్డారు. మంచినీటి పథకం వద్ద పాత నీటి పైపులైన్ల స్థానే కొత్తగా పైపులైన్లను ఏర్పాటు చేసే విషయమై సోమవారం కూడా పనులు కొనసాగాయి. తీరా పనులు పూర్తి కాకపోవటంతో తాగునీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులుపడ్డారు. మంగళవారం కూడా ఈ పనులను నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు తెలిపారు. దీంతో తాగునీటి ఇబ్బందులు మరొక రోజు తప్పవా? అంటూ గ్రామస్తులు వాపోతున్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



గుడ్లవల్లేరు: మండలంలోని పెంజెంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లోని పేద విద్యార్థులకు పీఏసీఎస్ అధ్యక్షుడు బొప్పన శివప్రసాద్ సోమవారంనోట్ పుస్తకాలు, పెన్ ప్యాకెట్లు అందజేశారు. విద్యార్థులకు సుమారు రూ.8వేలతో ఈ పుస్తకకాలు, పెన్ ప్యాకెట్లు శివప్రసాద్ అందజేశారని పాఠశాల హెచ్ఎం కె.మహాలక్ష్మి తెలిపారు. అలాగే విద్యార్థులకు మినరల్ వాటర్ అందించే నిమిత్తం ఏడాది మొత్తానికి రూ.8వేల విరాళాన్ని శివప్రసాద్ ప్రకటించారని పేర్కొన్నారు.

క్షయపై అప్రమత్తంగా ఉండాలి



ముదినేపల్లి రూరల్: క్షయ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముదినేపల్లి వైద్యాధికారి శాంతిశ్రీ అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో మండలంలోని వడాలి సచివాలయంలో క్షయ, హెచ్ఐవీపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతిశ్రీ మాట్లాడుతూ క్షయ లక్షణాలు ఉన్నవారు స్థానిక వైద్య సిబ్బందిని సంప్రదించి ఉచితంగా చికిత్స, మందులను పొందాలన్నారు. లింక్ వర్కర్స్ సీహెచ్ నాగలక్ష్మీ, కె చంద్రావతి మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపరాదని వారిని ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమావేశంలో ఏఎన్ఎం ఎస్ చంద్రిక, ఎంఎల్హెచ్పీజి స్నేహ పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి విరాళం



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి సోమవారం భారీ విరాళం సమకూరింది. కైకలూరు మండలం ఆటపాకకు చెందిన పటాకుల వెంకటేశ్వరరావు కుమారుడు లక్ష్మణయాదవ్ అమెరికాలో స్థిరపడ్డారు. స్వామిపై భక్తితో అన్నదానానికి రూ.3,38,641 విరాళంగా స్వామిసన్నిధిలో ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ద్వారా ఆలయ సహాయ కమిషనర్ ఆర్ గంగా శ్రీదేవికి కుటుంబసభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను స్వామివారి చిత్రపటం, ప్రసాదాలతో సత్కరించారు.

నేడు మండల సమావేశం

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి మండల పరిషత్ సమావేశం మంగళవారం మధ్యాహ్నం జరుగుతుందని ఎంపీడీఓ వై.రామకృష్ణ తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో మండల పరిషత్ సమావేశపు హాలులో జరుగుతుందన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులకు అగచాట్లు

బస్సులు ఆపడం లేదంటూ ఆవేదన



గుడ్లవల్లేరు బస్టాప్లో పడిగాపులు కాసినా ఆపని బస్సు

గుడ్లవల్లేరు: ఉచిత బస్సు పుణ్యమా అంటూ ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులకు అగచాట్లు తప్పటం లేదు. బస్పాస్లు కొనుగోలు చేసిన విద్యార్థులకు అయితే డ్రైవర్లు బస్సులు ఆపకుండా సినిమా చూపెడుతున్నారు. గుడ్లవల్లేరు విద్యా సంస్థలకు నిలయం. ఈ కాలేజీల విద్యార్థులు వేలాది మంది జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తున్నారు. గుడివాడ, మచిలీపట్నం, విజయవాడ, హనుమాన్ జంక్షన్, పెడన, ముదినేపల్లి, కైకలూరు తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులకు వస్తుంటారు. ఉదయం గడిచిందిలే అనుకుంటే.. సాయంత్రం కాలేజీల నుంచి వెళ్లేటపుడు ఈ విద్యార్థులకు నరక ప్రాయమే. అప్పటి వరకు చదివి అలసి సొలసి పోయి ఇంటి ముఖం పట్టే సమయంలో విద్యార్థులను ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు బస్సులు ఆపకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

గంటల తరబడి పడిగాపులు

20 నిమిషాలకు ఒక బస్సు వచ్చినా...బస్ పాస్లు ఉండే విద్యార్థులను చూసి ఆపకుండా వెళ్లిపోతున్నారు. దీంతో రాత్రి అయినా గంటల తరబడి నిలువు కాళ్ల మీద విద్యార్థులు పడిగాపులు పడుతున్నారు. ఉదయానే మళ్లీ కాలేజీకి రావాలంటే...త్వరగా ఇంటికి వెళ్లాల్సిందే. కాని బస్సులు ఆపక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఏదో ఒక బస్సును మనసున్న డ్రైవర్ ఆపినా...ఎక్కువ మంది విద్యార్థులు ఉండటంతో బస్సులో అంతమంది పట్టడం లేదు. మళ్లీ కొంతమంది అదే బస్టాప్లో ఆగిపోవటంతో నిరాశే ఎదురవుతుంది.

బస్టాప్కు వచ్చినా..

కాలేజీ రోడ్డు వద్ద బస్సులు ఆపరని అంబేడ్కర్ సెంటర్లోని బస్టాప్కు వచ్చినా.. విద్యార్థుల బ్యాగ్లను గుర్తు పట్టిన డ్రైవర్లు బస్సులు ఆపటం లేదు. కాలేజీ నుంచి కిలోమీటర్ల కొద్దీ నడిచి వచ్చినా... ఫలితం దక్కటం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ప్రత్యేక ఆర్టీసీ టీములు దగ్గర ఉండి బస్సులను నిలిపి పాస్లు ఉన్న విద్యార్థులను ఎక్కించినా ఫలితం దక్కటం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి పాస్లు ఉన్న విద్యార్థులను ఎక్కించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

యూరియా కొరత నివారణకు చర్యలు తీసుకోండి



మొవ్వ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఐ నాయకులు

మొవ్వ: యూరియా, డీఏపీ లాంటి కాంప్లెక్స్ ఎరువులు అందక రైతుల అవస్థలపై ప్రభుత్వం దృష్టి సారించాలని, యూరియాను కొరత నివారించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పామర్రు నియోజకవర్గ సీపీఐ సమితి ఆధ్వర్యంలో జూనియర్ అసిస్టెంట్ సుమంత్కు వినతిపత్రాన్ని అందజేశారు. పంటల సాగుకు యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సొసైటీల ద్వారా రైతులకు యూరియా ఇప్పించాలని పామర్రు నియోజకవర్గ కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కోదాటి నారాయణరావు, పామర్రు నియోజకవర్గ సహాయ కార్యదర్శి కోసూరు వెంకట అప్పారావు, నాయకులు కొండా నాగేశ్వరరావు, ప్రాజర్ల మెహరాలి పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు



కురమద్దాలిలో క్యూలో పడిగాపులు కాస్తున్న రైతులు

కురమద్దాలి(మొవ్వ): పామర్రు మండలం కురమద్దాలిలో యూరియా కోసం వందలాది మంది అన్నదాతలు సోమవారం తెల్లవారు జాము నుంచి పడిగాపులు కాశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రం వద్ద పంపిణీ చేసిన ఈ యూరియా కోసం మహిళా రైతులు సైతం సుమారు ఏడు గంటల మేర క్యూలో వేచి ఉన్నారు. మూడు ఎకరాలకు ఒక యూరియా బస్తా ఇవ్వటంపై రైతులు అసహనం వ్యక్తం చేశారు. దీంతో రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. సన్నకారు రైతులకు యూరియా అందకుండా పెద్దల ఇళ్లకు, కూటమి నాయకుల ఇళ్లకు తరలి వెళ్లిపోతుందని రైతులు ఆరోపించారు.

బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పునఃప్రారంభించాలి



ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

గుడివాడ టౌన్: తాము అధికారంలోకి వస్తే రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం మాట నిలుపుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. కొండ డిమాండ్ చేశారు. స్థానిక ఏలూరు రోడ్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కొండ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు అయినా బోర్డు పునః ప్రారంభం ఊసే ఎత్తక పోవడం విచారకరమన్నారు. తక్షణమే దీనిపై ప్రభుత్వం స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా ఈ నెల 15వ తేదీ విజయవాడలోని లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. నిరసన కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, అధ్యక్షుడు ఓ. సీతారామయ్య, బండి శ్రీను, ఎం. నారాయణ, రాము పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం



మొక్కలు నాటుతున్న రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై.కల్యాణచక్రవర్తి

గుడివాడ టౌన్: పర్యావరణ పరిరక్షణకు పచ్చదనాన్ని పెంపొందించడం పరిష్కారం అని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై. కల్యాణచక్రవర్తి అన్నారు. సోమవారం జిల్లా గవర్నర్ గుడివాడ క్లబ్ విజిట్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

వాటిలో ప్రధానంగా మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమస్యలు పరిష్కరించవచ్చని తెలియచేసే కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఎం. రమణమూర్తి, క్లబ్ అధ్యక్షుడు వై. నాగేశ్వరరావు, కార్యదర్శి జి. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా అవకాశం

పెదపారుపూడి: మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా సమాన అవకాశాలు కల్పించి గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తహసీల్దార్ శ్రీనునాయక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే చోట మహిళలకు రక్షణపై మండల స్థాయి కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మహిళలకు ఉన్న హక్కుల గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విమాదేవి, ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాస్, ఎంఈఓ బొడ్డు శ్రీనివాస్, వ్యవసాయాధికారి త్రినాథ్ ఆంజనేయరావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ షహనాజ్ పాల్గొన్నారు.

శ్మశానవాటిక దారికి భూసేకరణ

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ శివారు పెద ఎస్సీ కాలనీలో పంట పొలాల్లో మధ్య ఎస్సీ శ్మశాన వాటికకు వెళ్లాటానికి దారి సమస్య ఉండటంతో తహసీల్దార్ శ్రీనునాయక్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాటాడుతూ ఎస్సీ కాలనీలో ఎంతో కాలం నుంచి పంట పొలాల మధ్య ఎస్సీ శ్మశాన వాటిక ఉండటంతో వర్షాకాలం వస్తే దారి కోసం ఇబ్బందులు పడేవారన్నారు. దీంతో దారి సమస్యను పరిష్కరించేందుకు భూసేకరణ చేస్తామన్నారు. వీఆర్వో ఫణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



కైకలూరు: లయన్స్ క్లబ్ ఆఫ్ కైకలూరు మగువ ఆధ్వర్యంలో 1,700 మంది నేషనల్ స్కూల్ విద్యార్థులకు ఏలూరు శంకర నేత్రాలయ వైద్య సిబ్బంది సోమవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. సమస్యలు గుర్తించిన వి ద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని క్లబ్ జిల్లా చై ర్మన్ యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. అనంత రం క్లబ్ తరుపున రూ.30 వేలు విలువైన కుట్టుమిషన్లను ఆరుగురు మహిళలకు పంపిణీ చేశారు. కైకలూరు క్లబ్ అధ్యక్షురాలు లక్ష్మీ మానస, సెక్రటరీ ఎస్.మాధవి, కోశాధికారి ఎం.మాధవి, నేషనల్ స్కూలు కరస్పాండెంట్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ముదినేపల్లి రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ టి.నారాయణదాసు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి ఉపాధ్యాయులు నిరసన వారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ముదినేపల్లిలో ఏపీటీఎఫ్ నాయకులతో సోమవారం సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఎదురు చూస్తున్నప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడం ఉపాధ్యాయులను తీవ్ర నిరాశకు గురిచేస్తోందన్నారు. పెండింగ్లో ఉన్న నాలుగు డీఏలు విడుదల చేయడంతో పాటు సీపీఎస్ రద్దు చేయాలని, పీఆర్సీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కిటకిటలాడిన ఆలయాలు

మొవ్వ: మండలంలోని పలు ఆలయాలు సోమవారం ఉదయం భక్తులతో కిటకిటలాడాయి. చంద్ర గ్రహణం ముగియటంతో భక్తులు అధిక సంఖ్యలో వేకువ జామున ఆలయాలకు విచ్చేశారు. కూచిపూడి శ్రీ బాలా త్రిపుర సుందరయ్య సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కూచిపూడి నుంచి కాక పరిసర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి ప్రత్యేక అభిషేకాలు చేయించారు.

చోరగుడి ఆలయాల్లో చోరీ



పమిడిముక్కల: చోరగుడిలోని శ్రీ రాజరాజన రేంద్ర స్వామి, వేణుగోపాలస్వామి ఆలయాల్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. శివాలయంలో పార్వతీదేవి మంగళ సూత్రాలు, విష్ణాలయంలో ఉత్సవ విగ్రహాల సూత్రాలు చోరీకి గురయ్యాయి. పామర్రు సీఐ శుభకర్, ఎస్ఐ శ్రీనులు సోమవారం చోరగుడి వెళ్లి ఆలయాలను పరిశీలించారు. అర్చకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్తో తనిఖీ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శుభకర్ తెలిపారు.

గృహ హింస నిరోధక చట్టంపై అవగాహన ఉండాలి

మోపర్రు(పెదపారుపూడి): ప్రతి మహిళ గృహ హింస నిరోధక చట్టంపై అవగాహన కలిగి ఉండాలని వెంట్రప్రగడ సెక్టార్ సూపర్వైజర్ ఎం.శివనాగమణి అన్నారు. మండలంలోని మోపర్రు అంగన్వాడీ కేంద్రంలో గృహ హింస చట్టంపై చిన్నారులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధాన సూత్రధారిని అరెస్టు చేయాలి



కైకలూరు దానిగూడెంలో దళిత కుటుంబాలతో మాట్లాడుతున్న బీవీ.రావు

కైకలూరు: దళితులపై జనసేన కార్యకర్తల దాడి అత్యంత దారుణమని, దాడికి సూత్రధారి, ప్రధాన నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మేధావుల ఫోరం కార్యదర్శి బీవీ.రావు డిమాండ్ చేశారు. కైకలూరు శివారు దానిగూడెంలో బాధిత కుటుంబాలను సోమవారం పరామర్శించారు. న్యాయం చేయాలని నిరసన తెలియజేస్తే దళితులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని ఖండించారు. అనంతరం ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు దాసరి అబ్రహం లింకన్, దళిత నాయకులు పాల్గొన్నారు.

‘అన్నదాత పోరు’ను జయప్రదం చేయండి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్కుమార్



మర్రివాడలో అన్నదాత పోరు పోస్టర్ను ఆవిష్కరించిన కైలే అనిల్కుమార్



నందివాడలో అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

పమిడిముక్కల: ఎరువుల బ్లాక్ మార్కెట్పై మంగళవారం జరిగే అన్నదాత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్కుమార్ రైతులకు పిలుపునిచ్చారు. మండలంలోని మర్రివాడ గ్రామంలో ‘బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ’ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉయ్యూరు వీరమ్మతల్లి గుడి నుంచి మార్కెట్ యార్డ్ వద్ద ఆర్డీఓ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లి ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తామన్నారు. రైతన్నకు బాసటగా వైఎస్సార్ సీపీ నిలుస్తుందని పేర్కొన్నారు. అదను దాటుతున్నా యూరియా అందక సన్న, చిన్నకారు, కౌలు రైతులు అవస్థలు పడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. యూరియాను బ్లాక్ చేసి పెద్ద రైతులు, కూటమి నాయకులకు మాత్రమే అందజేస్తున్నారన్నారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్యూఆర్ కోడ్ను డౌన్లోడ్ చేసుకొని ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఎంపీటీసీ సభ్యురాలు ఊబ మల్లేశ్వరి, నాయకులు గొర్జెపూడి బుజ్జి, పోలిమెట్ల వంశీకృష్ణ పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎంపిక

అనంతరం గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొలుసు నాగరాజు, ప్రధాన కార్యదర్శులుగా ఊబ రాజేంద్రప్రసాద్, రాజులపాటి వెంకటేశ్వరరావు, వంపుగడవల పండమ్మ, దారం జయంత్, కార్యదర్శులుగా గుండే వెంకటేశ్వరరావు, మాగంటి సాంబశివరావు, కట్ట ఆంజనేయులు, మాగంటి లక్ష్మీతిరుపతమ్మని ఎంపిక చేశారు. గోపువానిపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వెంట్రప్రగడ విఠల్కుమార్, ప్రధాన కార్యదర్శులుగా దేవరపల్లి నాగేశ్వరరావు, మంటాడ చంద్రమోహన్, వల్లభనేని వీరభద్రరావు, కొడవలూరి మహేష్, కార్యదర్శులుగా మంటాడ సాయిరామ్, బాణావత్ గోపికృష్ణ, దేవరపల్లి మనోహర్, మంటాడ రాకేష్లను ఎంపిక చేశారు.

నందివాడలో..

నందివాడ: రైతుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం నిర్వహించనున్న ‘అన్నదాత పోరు’ను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పెయ్యల ఆదాం, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సెక్రెటరీ దేశిరెడ్డి రామ్మోహన్రెడ్డి, కృష్ణా జిల్లా జనరల్ సెక్రటరీ కందుల నాగరాజు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పంట సాగుకు రైతులు అష్ట కష్టాలు పడుతున్నారన్నారు. వరి పంటకు సరిపడా యూరియా కూడా సరఫరా చేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ఆరోపించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు పంపిణీ చేస్తే ఈ ప్రభుత్వం బ్లాక్ మార్కెట్కు తరలిస్తుందని ఆరోపించారు. ఎరువులను బ్లాక్ మార్కెట్కు తరలించే ప్రభుత్వాన్ని నిలదీస్తూ రైతులకు బాసటగా నిలిచేందుకు గుడివాడలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి శాంతియతంగా ర్యాలీ చేస్తూ ఆర్డీఓకు వినతిపత్రాన్ని అందజేసి ‘అన్నదాత పోరు’ నిరసన కార్యక్రమం చేపట్టేందుకు పార్టీ శ్రేణులంతా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, తోట నాగరాజు, రంగారెడ్డి, నాగూర్, ప్రసాద్, శ్రీకాంత్ రెడ్డి, కిరణ్ రెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాస్రెడ్డి, జ్ఞాన సుందర్రావు, లోకేష్ పాల్గొన్నారు.

రాజారావుకు ఘన నివాళులు



రాజారావుకు నివాళులర్పిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

గుడివాడ టౌన్: ఆంధ్రప్రజా నాట్యమండలి వ్యవస్థాపకులు గరికపాటి రాజారావు వర్ధంతి సోమవారం జరిగింది. స్థానిక సీపీఎం కార్యాలయంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో రాజారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎందరో రంగస్థల సినీ కళాకారులను రాష్ట్రానికి అందించిన గొప్ప కళాభిమాని రాజారావు అని కొనియాడారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి గుడివాడ అధ్యక్షుడు ఎల్. సురేంద్ర, వై. కోటేశ్వరరావు, రంగస్థల నటుడు అవిర్నేని వెంకటేశ్వరరావు, వి. కృష్ణ కిషోర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్సీపీ రెడ్డి, ఐద్వా కార్యదర్శి పి. రజిని, కె. సురేష్, జి. త్రిమూర్తులు పాల్గొన్నారు.



పామర్తికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

పామర్తి సుబ్బారావుకు నివాళి

గుడివాడ టౌన్: ప్రముఖ కళాకారుడు, బ్యాడ్మింటన్ జాతీయ అవార్డు గ్రహీత పామర్తి సుబ్బారావు జయంతి సోమవారం నిర్వహించారు. స్థానిక కైకాల సత్యనారాయణ కళామందిరం ఆవరణలోని పామర్తి సుబ్బారావు విగ్రహానికి ప్రభాకర నాట్యమండలి కార్యదర్శి మట్టా రాజా ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో ప్రముఖ రేడియో ఆర్టిస్టు మాదుగుల రామకృష్ణ, మాటూరి రంగనాథ్, వంగా శ్రీనివాస్, పి.వి. సత్యనారాయణ, అబ్దుల్ గఫార్, నరహరిశెట్టి ప్రసాదు, బి. రాధాకృష్ణ, కేశవరావు, ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా పిన్నమనేని కోటేశ్వరరావు జయంతి



కోటేశ్వరరావు విగ్రహానికి నివాళులర్పించి కేకును కట్ చేస్తున్న నాయకులు, అభిమానులు

నందివాడ: మండలంలోని పోలుకొండ గ్రామంలో జెడ్పీ మాజీ చైర్మన్ పిన్నమనేని కోటేశ్వరరావు జయంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గుడివాడ అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య, ఆరికపూడి రామశాస్త్రి హాజరయ్యారు. తొలుత కోటేశ్వరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అభిమానులు ఏర్పాటు చేసిన కేకును వెంకటేశ్వరరావు కట్ చేశారు. ఈ సందర్భంగా పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కొంతమంది నేతలు మాత్రమే పరితపిస్తారన్నారు. అటువంటి కోవకు చెందిన వ్యక్తి కోటేశ్వరావు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో విగ్రహ ప్రదాన కర్త చింతా వెంకయ్య, గ్రామ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు పర్వతనేని చిన్నబాబు, గొట్టుముక్కల బోసు రాజు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్తో మిఠాయి దుకాణం దగ్ధం

పామర్రు(మొవ్వ): విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో పామర్రులోని ఓ మిఠాయి దుకాణం పూర్తిగా దగ్ధమైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానిక చల్లపల్లి రోడ్డులోని నాగేశ్వరరావు మిఠాయి దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఆ దుకాణం పూర్తిగా దగ్ధమైంది, సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ సంఘటనపై ఫైర్ ఆఫీసర్ రాంబాబు మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో దుకాణం పూర్తిగా దగ్ధమైందని నష్టాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి అంచనాలు వేస్తున్నామని తెలిపారు.